# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 25.08.2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 58

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్

మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్




## విదేశీ విద్యార్థులకు హార్వర్డ్ హెచ్చరిక

**సెప్టెంబర్ 15లోపు అమెరికాకు చేరాలని సూచన**

**వీసా నిబంధనల్లో కీలక మార్పులకు రంగం**

వాషింగ్టన్, ఆగస్టు 24।

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అంతర్జాతీయ విద్యార్థులకు ప్రముఖ హార్వర్డ్ విశ్వవిద్యాలయం కీలక హెచ్చరిక జారీ చేసింది. అమెరికా జాతీయ భద్రతా శాఖ ఎఫ్-1, జే-1 వీసా నిబంధనల్లో తీసుకురానున్న మార్పుల నేపథ్యంలో విదేశీ ప్రయాణాల్లో (మిగతా 2వ పేజీలో)



# హక్కులను కాలరాస్తున్న కేంద్రం

## అమెరికా పర్యటన తిరస్కరణపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

**తెలంగాణపై వివక్ష చూపుతున్నారని ఆరోపణ.. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్న వ్యాఖ్యలు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి, తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోందని ఆరోపించారు.

- హైదరాబాద్, ఆగస్టు 24

రాష్ట్ర అభివృద్ధి, విద్య, క్రీడలు, పెట్టుబడుల సాధన లక్ష్యంగా విదేశీ పర్యటన కార్యాచరణ రూపొందించుకున్నామని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖకు ముందుగానే సమర్పించామని తెలిపారు. అయితే ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను తిరస్కరించడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రాల కలయికనే కేంద్ర ప్రభుత్వం అనే (మిగతా 2వ పేజీలో)

## సింగరేణిని కాపాడుకుంటూ..
# లాభాల బాటలో నడిపిస్తాం



సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు కై క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు!

బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి సింగరేణి

ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు.

-2లో




## దూసుకుపోతున్న బంగారం ధరలు

## అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి




ప్రాథమికి సౌకర్యా కూడా మృగ్యం

ఇలా అయితే యువత ఎలా చదువు సాగిస్తుంది

మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజిత్ దీప్కే లేఖ

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది.





## క్రమశిక్షణకు అందరూ కట్టుబడాలి

**కొండా సురేఖ నోటీసులపై సీఎం స్పందన**

పార్టీ వ్యవహారాలపై వ్యాఖ్యానించనన్న సీఎం

నిర్ణయం క్రమశిక్షణా సంఘానిదే

హైదరాబాద్, ఆగస్టు 24

రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ విషయంలో ఎవరూ మినహాయింపు కాదనే సందేశాన్ని ఆయన (మిగతా 2వ పేజీలో)



## విదేశీ పర్యటనపై సీఎంకు శుభాకాంక్షలు

లండన్ పర్యటన విజయంపై అభినందనలు

సచివాలయంలో ప్రజాప్రతినిధుల సమావేశం

పెట్టుబడుల ఆకర్షణపై చర్చ

రాష్ట్రాభివృద్ధికి మద్దతు ప్రకటించిన నేతలు

హైదరాబాద్, ఆగస్టు 24 : విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలియజేశారు. ఇటీవల నిర్వహించిన విదేశీ పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం, విద్య, క్రీడలు, పారిశ్రామిక రంగాల్లో సహకార అవకాశాలను అన్వేషించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పర్యటన

2

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం

హైదరాబాద్,: తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ లాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం దిశా నిర్దేశర చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లు సాధించడంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఐదారు సంవత్సరాల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైని కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ–అసైన్ చేసిన తాడిచర్ల–2 కోల్ బ్లాక్ విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాకుండా జెన్కోను ఒప్పించి, సింగరేణికి వేలంలో మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ –2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి ఃꠃꠃꠃ లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రా÷ట్, లిథియం, కోబాల్ట్ వంటి 'క్రిటికల్ మినరల్స్' (కీలక ఖనిజాలు) మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇప్పటికే కర్ణాటకలోని ఒక గోల్డ్ మైన్ వేలంలో పాల్గొని సాధించామని, ఆ గని ద్వారా భవిష్యత్ లో అక్కడ మైనింగ్ చేస్తే సింగరేణికి నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 43,000 నుండి 45,000 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30,000 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా సరే మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలా ముందుకు వెళ్లాలన్నారు. 100 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థను అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నతస్థాయిలో నిలపడానికి సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతమైన, డైనమిక్ నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ మరియు నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. సింగరేణి గొప్పతనాన్ని ఎన్నో వేదికలపై ప్రశంసించానని ఆయన గుర్తుచేసుకున్నారు. సింగరేణి మనమందరం గర్వపడాల్సిన ప్రతిష్టాత్మకమైన సంస్థ అని అభివర్ణించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కోసం అతికీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిభట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రిని, స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి వారందరినీ ఒప్పించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేకును సింగరేణికి కూడా రవాణా చేయడం సాధ్యమైందన్నారు. అదే సమయంలో 2013లో యూపీఏ ప్రభుత్వ కేటాయించిన తాడిచెర్ల –2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు.

అదే సమయంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా గత బీఆర్ఎస్ పాలకులు సింగరేణిని అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు కీలక గనులను సంస్థ చేజార్చుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడానికి సింగరేణికి అనుమతి ఇవ్వడం వల్ల ఇటీవలే మణుగూరు డిప్‌సైడ్ –2 బ్లాక్‌ను సింగరేణి చేజిక్కించుకుందని వారు వివరించారు. బొగ్గు ఉత్పత్తికి పరిమితమైన సింగరేణి సంస్థను కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్తు అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు.

## విద్యార్థులకు హార్వర్డ్ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న విద్యార్థులు, పరిశోధకులు సెప్టెంబర్ 15లోపు తిరిగి అమెరికాకు చేరుకోవాలని సూచించింది. కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత తిరిగి ప్రవేశించే వారికి తాజా నియమాలు వర్తించే అవకాశం ఉండటంతో ఈ సూచనలు చేసినట్లు విశ్వవిద్యాలయం వెల్లడించింది. ప్రస్తుతం అంతర్జాతీయ విద్యార్థులు తమ విద్యా కార్యక్రమం పూర్తయ్యే వరకు అమెరికాలో ఉండేందుకు అనుమతించే "డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్" విధానం అమల్లో ఉంది. ఈ విధానం కారణంగా కోర్సు పూర్తయ్యే వరకు ప్రత్యేక కాలపరిమితి లేకుండా విద్యార్థులు దేశంలో ఉండగలుగుతున్నారు. అయితే కొత్త మార్గదర్శకాల ప్రకారం ఈ విధానాన్ని రద్దు చేసి, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కొత్త వ్యవస్థను అమలు చేయాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త విధానంలో విద్యార్థులకు గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు మాత్రమే అనుమతి ఇవ్వడం లేదా వారు అభ్యసిస్తున్న కోర్సు వ్యవధికి అనుగుణంగా ముందుగానే ముగింపు తేదీని నిర్ణయించడం జరుగుతుంది. దీంతో దీర్ఘకాలిక పరిశోధన కార్యక్రమాలు, డాక్టరేట్ కోర్సులు లేదా ప్రత్యేక విద్యా ప్రణాళికల్లో ఉన్న విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యా వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా అనుకోని కారణాలతో కోర్సు ఆలస్యం అయితే అదనపు అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉండి విద్యను కొనసాగిస్తున్న విద్యార్థులకు కొంత వరకు మినహాయింపులు లభించే అవకాశమున్నప్పటికీ, సెప్టెంబర్ 15 తర్వాత విదేశాలకు వెళ్లి తిరిగి ప్రవేశించే వారిపై కొత్త నిబంధనలు పూర్తిగా అమలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాణ ప్రణాళికలు రూపొందించుకునే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హార్వర్డ్ యాజమాన్యం సూచించింది. ముఖ్యంగా సెలవులు, పరిశోధన కార్యక్రమాలు లేదా కుటుంబ కారణాలతో విదేశాల్లో ఉన్నవారు నిర్ణీత తేదీలోపు తిరిగి చేరుకోవాలని స్పష్టం చేసింది. నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండాల్సిన అవసరం ఉన్న విద్యార్థులు ప్రత్యేకంగా పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుంది.

## తెలంగాణ హక్కులను కాలరాస్తున్న కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య స్ఫూర్తిని గుర్తుంచుకోవాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాలను ప్రపంచానికి పరిచయం చేయడం, విద్యా సంస్థలు, క్రీడా రంగం, పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించడం కోసం అమెరికా పర్యటనను ప్రణాళికబద్ధంగా రూపొందించామని వివరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అన్ని వివరాలు అందించినప్పటికీ అనుమతి నిరాకరించారని, ఇందుకు గల రాజకీయ కారణాలను ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నిర్ణయాలతో తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించిన ముఖ్యమంత్రి, అదే సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రికి ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతి ఇవ్వడాన్ని ప్రస్తావించారు. వైబ్రంట్ గుజరాత్ పేరుతో పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలకు అనుమతి ఉంటే, తెలంగాణ రైజింగ్--2047 కోసం చేపట్టిన పర్యటనను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. తన పర్యటనలో ఏవైనా అభ్యంతరకర అంశాలు ఉన్నట్లయితే ఇంగ్లాండ్ పర్యటనకు కూడా అనుమతి ఇవ్వకూడదని, ఒక దేశానికి అనుమతి ఇచ్చి మరో దేశానికి తిరస్కరించడం వివక్షకు నిదర్శనమని అన్నారు. విద్య, క్రీడల అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు విదేశాల్లో విద్యాభ్యాసం చేసి దేశానికి దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రపంచ స్థాయి విద్య, అవకాశాలు అందుబాటులోకి రావాలంటే విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలు అవసరమని, అందుకే విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం చేపట్టిన కార్యక్రమాలని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికీ గుజరాత్ నాయకుడిగానే వ్యవహరిస్తున్నారని, భారత ప్రధానిగా అన్ని రాష్ట్రాల పట్ల సమాన దృష్టితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తన పర్యటన తిరస్కరణ వ్యక్తిగత అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను అడ్డుకోవడం అంటే రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనని, కేంద్రం వైఖరిలో స్పష్టమైన వివక్ష కనిపిస్తోందని ఆరోపించారు. ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా ఖండించాలని అన్ని వర్గాలకు పిలుపునిచ్చారు.

## పవర్ ఎగ్జిబిషన్-2026కు శ్రీకారం

హైదరాబాద్, ఆగస్టు 24: రాష్ట్రంలో ఒకప్పుడు 13 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్ గరిష్ఠ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు చేరుకున్నప్పటికీ సమర్థవంతమైన ప్రణాళికలతో నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో థర్మల్, సోలార్, హైడల్, బ్యాటరీ స్టోరేజ్ వంటి పలు మార్గాల్లో సామర్థ్యాన్ని పెంచుతున్నామని ఆయన వివరించారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. 1912 టోల్‌ఫ్రీ సేవ, పవర్ అంబులెన్స్‌లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ వంటి వినూత్న కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా కల్పించడంతో పాటు పెండింగ్ ప్రమోషన్లను కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, సేవల మెరుగుదల రెండింటినీ సమానంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

## క్రమశిక్షణకు అందరూ కట్టుబడాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించడం సరికాదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణా సంఘం పరిశీలిస్తోందని, తగిన నిర్ణయం తీసుకునే బాధ్యత ఆ కమిటీదేనని స్పష్టం చేశారు. పార్టీ వ్యవహారాలు పార్టీ వేదికలపైనే చర్చించబడతాయని పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణా సంఘం మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

## విదేశీ పర్యటనపై సీఎంకు శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడే అనేక అంశాలపై చర్చలు జరిగినట్లు పేర్కొంది. సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు రాష్ట్రా భివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. విదేశీ పెట్టుబడుల సాధనతో పాటు తెలంగాణను దేశం లోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభు త్వం చేస్తున్న కృషిని అభినందించారు. ముఖ్య మంత్రి కూడా ప్రజాప్రతినిధులతో రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గాల అవస రాలు, పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చిం చారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిం చే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు మం త్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొ ని రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపై తమ అభిప్రాయా లను వెల్లడించారు. పెట్టుబడుల ఆకర్షణ, మౌలి క వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం. విదేశీ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టనున్న తదుపరి కార్యాచరణపై స్పష్టత ఇచ్చిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు, అవకాశాలు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సమావే శంలో పునరుద్ఘాటించినట్లు తెలిసింది.

## విజయగాథగా ముసునూరు

(మొదటి పేజీ తరువాయి)

తమిళ దినపత్రికలో పారిశ్రామికవేత్త ఎస్పీబీ పట్టాభి రామారావు మొక్కజొన్న పరిశ్రమలో సాధించిన విజయాల గురించి చదివినట్లు చెప్పారు. ఒకే వ్యవసాయ ఉత్పత్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఆయన ప్రయాణం తనను ఆకట్టుకుందని, వెంటనే అభినందనల లేఖ పంపినట్లు వివరించారు. అనంతరం పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్ బహుకరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పాటు ఇతరులకు కూడా ఆ పాప్‌కార్న్ అందించినట్లు తెలిపారు. భారత రైతుల సామర్థ్యాన్ని, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను ప్రపంచానికి చాటిచెప్పే ఉదాహరణగా ఈ సంఘటనను ప్రస్తావించినట్లు చెప్పారు. రైతు సంకల్పం, సాంకేతికత, పరిశ్రమ కలిస్తే ప్రపంచ మార్కెట్లను సైతం ఆకర్షించగలమని పేర్కొన్నారు. రైతులే దేశానికి వెన్నెముక అని ఉపరాష్ట్రపతి పునరుద్ఘాటించారు. దేశ ఆర్థికాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలు అన్నీ వ్యవసాయంతో ముడిపడి ఉన్నాయని వివరించారు. సంక్రాంతి, పొంగల్, లోహ్రీ, బిహు వంటి పంటల పండుగలు దేశ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూనే వ్యవసాయం భారతదేశాన్ని ఏకం చేస్తోందని చెప్పారు. స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా ఇప్పటికీ అత్యంత కీలకమని గుర్తుచేశారు. కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త పాప్‌కార్న్ వంగడాన్ని ఆవిష్కరించి, వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన పలువురు రైతులను సత్కరించారు.

# అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి

న్యూఢిల్లీ: ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకొని పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే లేఖ రాశారు. ఈ సమస్యను పరిష్కరించే ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమాచారం అందుబాటులో ఉంచాలని కేంద్రాన్ని ఆయన కోరారు. అందుకు సంబంధించిన వివరాలను విద్యశాఖ బహిరంగ పర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించబడ్డాయని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నింటికి మరమ్మతులు లేదా పూర్తి పునర్నిర్మాణం అవసరం ఉందో వివరించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు కేటాయించారు? అందులో ఎంత ఖర్చు చేశారు? కూడా తెలపాలని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంకా ఎన్ని అదనపు ప్రభుత్వ పాఠశాలలు అవసరం? అవుతాయో కూడా చెప్పాలని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరారు. బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇంకా ఇతర ఏఏ విధులు, బాధ్యతలు అప్పగించారో కూడా చెప్పాలని కేంద్రాన్ని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, శుభ్రంగా పని చేసే టాయిలెట్లు, సరైన క్రీడా సౌకర్యాలతోపాటు పరికరాలు ఉన్నాయో కూడా వివరించాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఈ లేఖ తాను రాజకీయం

కోసం కాదని.. ఇది విద్యార్థుల భవిష్యత్తు గురించి రాసిన లేఖ అంటూ కేంద్ర విద్యా మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే ప్రక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ఫ్రీ డయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిల్ల వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22–26 ఉంటే.. ఇప్పుడు రూ.45–52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120–130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70–75కి పెరిగింది. పండగలు, శుభకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళ్లు.. బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది. బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా ఆభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయార వుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి

సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటుల పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పలు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు.

వేగుచుక్క

# క్రమశిక్షణ కమిటీకి
# కొండా సురేఖ వ్యవహారం

**ఇందులో ఎవ్వరు కూడా ఇక మాట్లాడొద్దు**
**సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు**
**రాజకీయ వ్యవహారాలపై ప్రజాపతినిధులతో రేవంత్ చర్చ**



**హైదరాబాద్, ఆగస్ట్ 24 :** కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని.. ఇకపై ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణను నిర్లక్ష్యం చేయొద్దని నేతలకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావన్నారు. భూసేకరణ, ఫారెస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధి పై ఫోకస్ పెట్టండని ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్లపల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగ మాయి, మందల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం శ్రీహరి,డాక్టర్ సంజయ్,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.

## శ్రీశైలం నీళ్లు ఎత్తిపోస్తుంటే ఏం చేస్తున్నారు?

**మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్ట్ 24 :** కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. నీటిమట్టాలు తక్కువగా ఉన్నా వివిధ ఛానల్ల ద్వారా నీళ్లను ఏపి తరలిస్తున్నా తెలంగాణ చోద్యం చూస్తోందని అన్నారు. తెలంగాన భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు. ఒకవైపు శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 854 లెవల్‌లో గేట్లు తెరిస్తే పోతిరెడ్డి పాడు, పక్కన మల్యాల, హంద్రినీవా ఇది ఒక సిస్టమ్.. మరోవైపు అదే శ్రీశైలం ప్రాజెక్టులో 840 అడుగుల వద్దే ఒక టన్నెల్ 19.2 కిలోమీటర్ల టన్నెల్‌ను తవ్వి ముందుకు తీసుకొని పోయి రిజర్వాయర్‌ను కట్టారు. దాని పేరు నల్లమల సాగర్ అని అన్నారు. 43 టీఎంసీల యూజబుల్ వాటర్ అని వాళ్లు లెక్క చెబుతున్నరు. కానీ అది 53 టీఎంసీల రిజర్వాయర్. కట్టేశారు.. టన్నెల్స్ అయిపోయాయి. ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్ దగ్గర ఉండేట్వంటి అప్రోచ్ కెనాల్ అక్కడుండే గేట్లు తెరిస్తే చాలు.. శ్రీశైలం నీళ్లు 854 లెవల్ పోతిరెడ్డిపాడు అయిపోగానే.. శ్రీశైలం 854 లెవల్‌కు డౌన్ అయింది అంటే 840 లెవల్‌లో ఉండే వెలిగొండ రిజర్వాయర్ ద్వారా నీళ్లు తీసేస్తరు. నాలుగున్నర లక్షల ఎకరాల కోసం ప్రకాశం జిల్లా మార్కాపురం ఏరియా, నెల్లూరు, కడప జిల్లా కలిపి 33 మండలాల్లో నాలుగున్నర లక్షల ఎకరాలకు ఉద్దేశించినట్వంటి ఈ వెలిగొండ ప్రాజెక్టును ఆగస్టు 31న వాళ్లు ప్రారంభోత్సం చేసుకోవడానికి ఏర్పాటు చేసుకుంటున్నరు. ఎక్కడ పడుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి.. ఎక్కడున్నవ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఏం చేస్తున్నరు మీరు.. ? అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఉన్న నీళ్లు నల్లగొండకు, పాలమూరుకు ఇయ్యనీకే చేతనైతలేదు. పాలమూరు-రంగారెడ్డి తయారై ఉన్న సిస్టమ్‌ను ఆపరేట్ చేయడానికి చేతనైతలేదు మీకు.. మిగిలిన పనులు పూర్తి చేయనీకి చేతనైత లేదు. అది కూడా మనం దిగువన పెట్టిన వనరు. వాళ్లకు 854 లెవల్, 840 లెవల్ వచ్చే కంటే ముందే 802లో ఉండే సిస్టమ్‌ను వాడుకునేట్వంటి తెలివిలేని, చేతగాని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. అసమర్థత ముఖ్యమంత్రి, అసమర్థ సాగునీటి మంత్రి, జిల్లా మంత్రులకు సోయే లేదు.. ఈ విషయాల మీద అవగాహనే లేదు. వీళ్లు శ్రీశైలం దగ్గరకు పోయి ధర్నా చేస్తరట. మీళ్లు ఒక ప్రభుత్వంగా చేయాల్సింది ఏది.. ఏపీ ప్రభుత్వం ఆగడాల మీద కేంద్ర జలశక్తి దగ్గరనో, కృష్ణా వాటర్ బోర్డు మేనేజ్‌మెంట్ దగ్గరనో చట్టపరంగా అవసరమైతేనో మీరు ఆందోళన చేయాలి కదా.. మీ ఆందోళ రికార్డు చేయాలి కదా అన్నారు. ఇది కాకుండా ప్రభుత్వంలో ఉండే మంత్రి అక్కడికి పోయి ధర్నా చేస్తడట. పిల్లను సంకలో పెట్టుకుని ఊరంతా దేవులాడిండట వెనకటికి ఎవడో.. శ్రీశైలం నీళ్లు నీ దగ్గర ఉన్నయి వాడమంటే వాడటం చేతనైత లేదు కానీ.. వాళ్లు కట్టిన ప్రాజెక్టులు, కట్టడానికి పూనుకున్న ప్రాజెక్టులు ఎలాంటి అనుమతులు లేనవి. నీటి కేటాయింపులు లేనివి. రేపు బ్రిజేశ్‌కుమార్ ÷నైల్ అవార్డులో వాళ్లకు కేటాయింపులు ఏ మేరకు జరుగుతాయో ఆ మేరకు వాళ్లు వాళ్ల సిస్టమ్స్‌ను వాడుకుంటరు. ఆ సిస్టమ్‌ను మనం పోయి చేయగలిగేదేం లేదు. కానీ మనకు కేటాయించిన మందమైనా వాడుకునేందుకు సిస్టమ్‌ను మీరెందుకు పెండింగ్‌లో పెట్టినట్టు అని ప్రశ్నించారు.

## మహిళ బలవన్మరణం

**హైదరాబాద్, ఆగస్ట్ 24 :** హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై 10 నిమిషాలు పాటు కూర్చుంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవరణలోకి దూకేసింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ బలవన్మరణానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడితోనూ మాట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోందని.. దీనికి మందులు వినియోగిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

**ప్రభుత్వానికి మానవహక్కుల కమిషన్ ఆదేశాలు**

**హైదరాబాద్, ఆగస్ట్ 24 :** తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు అందాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు తరగతి గదుల్లో లీకేజీలు ఏర్పడటంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులను తాత్కాలికంగా చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు. విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావరణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది. మిషన్ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నివేదికలు కోరాలని సిఫారసు చేసింది. అలాగే ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

## తల్లిదండ్రులను చంపిన యువతి ఆత్మహత్య

**వారికిచ్చిన మత్తుమందుతో తనూ బలవన్మరణం**

**సంగారెడ్డి, ఆగస్ట్ 24 :** జనవరిలో ప్రేమించిన ప్రియుడి కోసం తల్లిదండ్రులకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హతమార్చిన సురేఖ అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులను పొట్టనపెట్టుకున్న మత్తు ఇంజెక్షన్‌తోనే తన ప్రాణం కూడా తీసుకుంది. వివరాల్లోకెళితే.. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని యాచారం గ్రామానికి చెందిన సురేఖ సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సమయంలో ఓ యువకుడిని ప్రేమించింది. తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పగా.. వారు నిరాకరించారు. ప్రేమ పెళ్లి కుదరదని వారించారు. దీంతో తల్లిదండ్రులపైనే ఆగ్రహం పెంచుకున్న సురేఖ ఇంజెక్షన్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి వారిని కడతేర్చింది. తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోయినట్టు చిత్రీకరించే ప్రయత్నం చేసింది. అయితే.. పోలీసులకు సురేఖపై అనుమానం రావడంతో దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. ఈ కేసులో అరెస్టైన సురేఖ కొన్ని రోజుల క్రితమే జైలు నుంచి బయటకి వచ్చింది. తిరిగి సంగారెడ్డికి వెళ్లిన ఆమె.. శాంతినగర్‌లో ఓ ప్రేవేట్ హాస్టల్లో బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి ఉగ్రలింకులు

**అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్న ఎన్ఐఏ**

**పెద్దపల్లి, ఆగస్ట్ 24 :** పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అతడి కార్యకలాపాలు, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.



## హెచ్ఎండీఏ కమిషనర్‌తో రఘునందన్ రావు భేటీ

**పెండింగ్ రోడ్డు, రైల్వే పనుల పూర్తికి అభ్యర్థన**

**హైదరాబాద్, ఆగస్ట్ 24 :** మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి చర్చించినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగింపు అంశంపై చర్చించడం జరిగింది. పటాన్‌చెరు ఎగ్జిట్-3 నుంచి ఎగ్జిట్-4, సుల్తాన్‌పూర్ మధ్య పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది. కొల్లూరు ఎగ్జిట్-2 వద్ద పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని అన్నారు.

## జాతీయ స్థాయి స్పెల్లింగ్ బి పోటీల్లో "సత్యశోధక్" విద్యార్థుల ప్రతిభ.




వేగుచుక్క న్యూస్, నిజామాబాద్: జాతీయ స్థాయి స్పెల్లింగ్ పోటీల్లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకున్నారు. పాఠశాలకు చెందిన సి.హెచ్. స్వేచ్ఛ "స్పెల్లింగ్ మాస్ట్రో " అవార్డును, ఎం. మేఘన "సూపర్ స్పెల్లర్ " అవార్డును అందుకుని పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో గల పి.ఎన్.ఎం. ఉన్నత పాఠశాలలో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి స్పెల్లింగ్ బీ పోటీల్లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థినులు సి. హెచ్. స్వేచ్ఛ "స్పెల్లింగ్ మాస్ట్రో " అవార్డును, ఎం. మేఘన "సూపర్ స్పెల్లర్ " అవార్డును నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అలయన్స్ ప్రధాన కార్యదర్శి కె. తులసి ప్రసాద్, ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి.ఎస్.ఎన్. మూర్తి, విశ్వం ఎడ్యుటెక్ డైరెక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు గ్రామీణ ప్రాంతం నుండి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యార్థులను ప్రశంసించారు. ఆంగ్ల భాష ప్రాముఖ్యతను తెలుపుతూ విద్యార్థులకు ఆంగ్ల ప్రావీణ్యాన్ని పెంపొందించుటకు సూచనలు చేశారు.

విద్యార్థినుల విశిష్ట ప్రతిభ పట్ల సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభను చాటి ప్రతిష్ఠాత్మక అవార్డులను సాధించడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని వివిధ జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో విశ్వం ఎడ్యుటెక్ ప్రతినిధులు వినాయక్, కిషోర్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, అంకిత్, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నిజామాబాద్‌లో గవర్నర్ పర్యటన



**ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీ.పీ**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఆగస్టు 24**

: రాష్ట్ర గవర్నర్ సి.శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 10.20 గంటల సమయంలో నిజామాబాద్ కు చేరుకోనున్నారు. రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు గవర్నర్ కు స్వాగతం పలుకుతారు. అక్కడి నుండి కట్టుదిట్టమైన బందోబస్తు మధ్యన కాన్వాయ్ ద్వారా ఉదయం 11.00 గంటలకు భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ కు చేరుకుని, నషా ముక్త్ భారత్ అభియాన్ (యాంటీ డ్రగ్స్ అవగాహన) కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో సునహరీ మిట్టీ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పసుపు రైతులతో భేటీ అవుతారు. కార్యక్రమం ముగిసిన అనంతరం డిచ్‌పల్లి మండలం బర్దిపూర్-ధర్మారం శివారులోని పీహెచ్‌ఆర్ కన్వెన్షన్ లో అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో గవర్నర్ పాల్గొనున్నారు.

గవర్నర్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటించనున్న ప్రతీ చోట పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీలు సమావేశమై గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రొటోకాల్ ను పాటిస్తూ గవర్నర్ పర్యటనకు ఎక్కడ కూడా ఏ దశలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మెడికల్ టీం, 108, 104, ప్రత్యేక డాక్టర్ల బృందంను అందుబాటులో ఉంచాలని, వేదిక, సీటింగ్ ను సరి చూసుకోవాలని, తాగునీరు, శానిటేషన్ పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులకు బాధ్యతలు పురమాయించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, గవర్నర్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే గవర్నర్ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు అనుమతిస్తామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేగుచుక్క




## రిజెక్షన్‌తోనే 'కోయిలా'కు భారీ హిట్.. విజయ్ బుల్గానిన్ ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

సినిమాల్లోకి రాకముందే తన సంగీతంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ సంగీత దర్శకుడు, గాయకుడు విజయ్ బుల్గానిన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. స్వతంత్రంగా రూపొందించిన పలు పాటలతో సంగీత ప్రియులకు దగ్గరైన ఆయన.. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగుపెట్టి తన ప్రతిభను నిరూపించుకున్నారు. 'బేబీ' సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డును కూడా అందుకున్నారు. విజయ్ బుల్గానిన్ కెరీర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన స్వతంత్ర పాటల్లో 'కోయిలా' ఒకటి. అలేఖ్య హారిక, వినయ్ షణ్ముఖ్ తదితరులతో కలిసి రూపొందించిన ఈ పాట అప్పట్లో యువతలో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా ఈ పాట వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాన్ని విజయ్ బుల్గానిన్ వెల్లడించారు. 'కోయిలా' పాటను తొలుత స్వతంత్రంగా విడుదల చేయాలనే ఉద్దేశంతో రూపొందించలేదట. సినిమాల్లో ఉపయోగించాలనే ఆలోచనతో ముగ్గురు, నలుగురు దర్శకులకు ఈ పాటను వినిపించినట్లు విజయ్ బుల్గానిన్ తెలిపారు.

## సిరుత్తై చిన్నారి రక్షణ ఇప్పుడు ఎలా ఉందంటే?

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

సినిమాల్లో హీరోలు, హీరోయిన్లు, విలన్లతో పాటు కొందరు చైల్డ్ ఆర్టిస్టులు కూడా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటారు. చిన్న వయసులోనే తమ నటన, క్యూట్‌నెస్‌తో మంచి క్రేజ్ తెచ్చుకున్న అలాంటి చైల్డ్ ఆర్టిస్టుల్లో బేబీ రక్షణ ఒకరు. తెలుగులో రక్షణ పేరు చాలామందికి తెలియకపోయినా.. తమిళ సినిమాలను, ముఖ్యంగా తమిళ డబ్బింగ్ చిత్రాలను చూసే ప్రేక్షకులకు ఆమె సుపరిచితమే. 2011లో కార్తీ హీరోగా నటించిన 'సిరుత్తై' సినిమాతో రక్షణ బాలనటిగా సినీరంగ ప్రవేశం చేసింది. ఈ చిత్రం రవితేజ నటించిన 'విక్రమార్కుడు'కు తమిళ రీమేక్‌గా తెరకెక్కింది. ఇందులో కార్తీ కూతురిగా నటించిన రక్షణ తన క్యూట్‌నెస్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.



# నెక్ట్స్ మూవీ కోసమేనా?



హైదరాబాద్, ఆగస్టు 24:అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని కెరీర్‌లో 'లెనిన్' కీలక విజయాన్ని అందించింది. చాలాకాలంగా ఎదురుచూస్తున్న కమర్షియల్ సక్సెస్‌ను అందుకున్న అఖిల్.. ఈ సినిమాతో రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. దీంతో అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. 'లెనిన్'లో అఖిల్ తొలిసారి పూర్తిస్థాయి గ్రామీణ యువకుడి పాత్రలో కనిపించారు. అఖిల్ కొత్త లుక్.. నెక్ట్స్ మూవీ కోసమేనా? రూపాన్ని పూర్తిగా మార్చుకున్నారు. సతీమణి జైనబ్‌తో కలిసి విమానాశ్రయంలో కనిపించిన ఆయన.. హెయిర్ కట్, ట్రిమ్ చేసిన గడ్డంతో స్టైలిష్‌గా దర్శనమిచ్చారు. అఖిల్ కొత్త రూపానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజి క మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తదుపరి సినిమా కోసమేనా? అఖిల్ కొత్త రూపం చూసిన అభిమానులు ఇది ఆయన తదుపరి సినిమా కోసమేనని అంచనా వేస్తు న్నారు. ప్రస్తుతం 'అఖిల్ 7'పై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే తన తదుపరి ప్రాజెక్టుపై అఖిల్ ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. పలువురు దర్శకుల పేర్లు దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో అఖిల్ ఓ సినిమా చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ పతా కంపై అల్లు అరవింద్ నిర్మించే అవకాశం ఉందని వార్తలు వస్తు న్నాయి. మరోవైపు దర్శకుడు పరశురామ్ పెట్లాతోనూ అఖిల్ ఓ ప్రాజెక్ట్ చేసే అవకా శముందని ప్రచారం సాగుతోంది. వీటిలో ఏ ప్రాజెక్ట్ ఖరారైందనే దానిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.



## రాఖీ యాడ్‌లో కృతి లుక్‌పై ట్రోలింగ్.. సపోర్ట్ కూడా!

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన రక్షాబంధన్ యాడ్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ కోసం రూపొందించిన ఈ ప్రకటనలో కృతి ధరించిన ఇండో-వెస్ట్రన్ డ్రెస్‌పై కొందరు నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. రక్షాబంధన్ వంటి సంప్రదాయ పండుగకు ఇలాంటి దుస్తులు ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు.

**రాఖీ యాడ్‌లో కృతి లుక్ ఇదే**

జ్యువెలరీ బ్రాండ్ రక్షాబంధన్ యాడ్‌లో కృతి సనన్ వైట్ కలర్ స్టైలిష్ బ్లౌజ్, స్కర్ట్‌లో కనిపించారు. యాడ్‌లో తన ఆన్‌స్క్రీన్ సోదరుడికి రాఖీ కట్టే సన్నివేశంలో ఆమె కనిపించారు. ప్రకటన విడుదలైన తర్వాత కృతి దుస్తులపైనే కొందరు నెటిజన్లు దృష్టి పెట్టారు. రక్షాబంధన్ వాతావరణానికి సంప్రదాయ దుస్తులు మరింత సరిపోయేవని కామెంట్లు చేశారు. 'పూజా తాలి ఎక్కడ?' అంటూ ప్రశ్నలు

కృతి లుక్‌తో పాటు యాడ్‌లో రక్షాబంధన్‌ను చూపించిన విధానంపైనా కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. పూజా తాలి ఎక్కడుందని, నుదుటన బొట్టు ఎందుకు లేదని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. పండుగకు సంబంధించిన ప్రకటనలో సంప్రదాయ అంశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. కృతికి మద్దతుగా మరో వర్గం మరోవైపు కృతిని విమర్శిస్తున్నవారికి కొందరు నెటి జన్లు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు. ఆమె ధరించింది బికినీ కాదని, ఇండో-వెస్ట్రన్ దుస్తులేనని చెబుతు న్నారు. పండుగ రోజున మహిళ ఎలాంటి దుస్తులు ధరించాలనే విషయంపై సోషల్ మీడియాలో నిబంధనలు విధించాల్సిన అవసరం లేదని కృతికి మద్దతు పలుకుతున్నారు. దీంతో యాడ్‌పై విమర్శలు, మద్దతు కామెంట్లు రెండూ వైరల్‌గా మారాయి.

## 'ఇరుముడి'లో ధనలక్ష్మి టీచర్.. ఈ నటి ఎవరో తెలుసా?

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. సినిమాతో పాటు ఇందులోని కొన్ని పాత్రలు కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా ధనలక్ష్మి టీచర్ పాత్ర సినిమా చూసిన తర్వాత కూడా ప్రేక్షకులను వెంటాడుతోంది. తెరపై తొలిసారి కనిపించినప్పుడే తన లుక్, చూపులు, నటనతో భయపెట్టిన ఈ పాత్రను చూసి చాలామంది ఆమె కొత్త నటి అనుకున్నారు. కానీ ధనలక్ష్మిగా కనిపించింది ఇప్పటికే దక్షిణాది చిత్ర పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకున్న స్వాసిక విజయ్. స్వాసిక విజయ్ కెరీర్ ఇప్పుడే మొదలైంది కాదు. 2009లో తమిళ చిత్రం 'వైగై'తో హీరోయిన్‌గా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, మలయాళ భాషల్లో వరుసగా సినిమాలు చేసింది. హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా.. కథలో ప్రాధాన్యం ఉన్న పాత్రలకు కూడా ఆమె ప్రాధాన్యం ఇచ్చింది. సినిమాలతో పాటు టెలివిజన్‌లోనూ పనిచేసిన స్వాసికకు కేరళలో మంచి గుర్తింపు ఉంది. 'వసంతి' చిత్రంలో ఆమె చేసిన పాత్రకు కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ క్యారెక్టర్ నటిగా పురస్కారం లభించింది. ఇటీవల తమిళ ప్రేక్షకుల్లో స్వాసిక పేరు మరింతగా వినిపించడానికి 'లబ్బర్ పందు' చిత్రం కూడా కారణమైంది.




## సూర్యకు మరో బ్లాక్‌బస్టర్.. రూ.200 కోట్ల క్లబ్‌లోకి!

**చెన్నై, ఆగస్టు 24 :**

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరితో కలిసి ఆయన నటించిన 'విశ్వనాథ్ ఀ సన్స్' చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. కుటుంబ కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రానికి తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతను కూడా ఆకట్టుకోవడంతో వసూళ్లు క్రమంగా పెరిగాయి. విడుదలైన రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల గ్రాస్ సాధించిన సినిమా.. నాలుగు రోజుల్లో రూ.150 కోట్ల మార్కును దాటింది. రెండో వారంలోనూ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.





## బాలయ్య 111వ సినిమాకు 'గాడ్' లేదా 'దాదా'?

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'చీదీఖ111'పై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' ఘన విజయం సాధించడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ హైప్ ఉంది. తాజాగా ఈ చిత్ర టైటిల్‌కు సంబంధించి ఫిలింనగర్ వర్గాల్లో ఓ ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం 'గాడ్' (+ాణ), 'దాదా' (ణాూణాూ) అనే రెండు పవర్‌ఫుల్ టైటిల్స్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. బాలకృష్ణ ఇమేజ్‌కు, గోపీచంద్ మలినేని మాస్ మేకింగ్ స్టైల్‌కు ఈ రెండు పేర్లు సరిగ్గా సరిపోతాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. వీటిలో ఒక టైటిల్‌ను త్వరలోనే అధికారికంగా ఖరారు చేసి ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు.